

గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో చేపట్టిన నిర్మాణాలు

# రాత్రికి రాత్రే నిర్మాణాలు

- ఖని చౌరస్తా పోచమ్మ మైదానంలో వెలసిన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు
- ఇదెక్కడి న్యాయం అంటున్న బాధితులు

కోల్‌సిటీ, మే 25: గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీపంలోని పోచమ్మ మైదానంలో మళ్లీ రాత్రికి రాత్రే నిర్మాణాలు వెలుస్తున్నాయి. రెండు రోజుల క్రితం ఖాళీగా కనిపించిన స్థలంలో ఆదివారం హఠాత్తుగా దుకాణాలు ప్రత్యక్షమయ్యాయి. పోచమ్మ మైదానంలో గతంలో అక్రమ నిర్మాణం పేరిట కూల్చివేసిన భవనం స్థానంలో అనుమతులు లేకుండా కొత్తగా నిర్మాణాలు చేపడుతుండడంపై ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో చౌరస్తాకు అటు వైపు గల ఆరు దుకాణాలు కూల్చివేసినందుకు బాధితులకు ఇటు దిక్కు పోచమ్మ మైదానంలో మొదట ఆరు షెట్టర్లను నిర్మించి ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా... ఆ ఆరు షెట్టర్లు రాను రానూ పదికి విస్తరించాయి. ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో దశాబ్దాల కాలంగా ఉన్న మొబైల్ షాపులను రోడ్ల వెడల్పు పేరుతో అర్ధంతరంగా కూల్చివేశారు. ప్రస్తుతం ఆ బాధితులు ఎలాంటి వ్యాపారాలు లేకుండా జీవనోపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన చౌరస్తాలో చూస్తుండగానే రోజు రోజుకూ కొత్త నిర్మాణాలు వెలుస్తుండడంతో ఇదెక్కడి న్యాయమంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు కూల్చివేతలు..మరో వైపు అక్రమ నిర్మాణాలు సాగుతుంటే సంబంధిత నగర పాలక టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూడటం పట్ల విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయమై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జే.అరుణ శ్రీని వివరణ కోరగా, పోచమ్మ మైదానం ప్రాంతంలో కార్పొరేషన్ నుంచి నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, ఒకవేళ అక్కడ కొత్త నిర్మాణాలు జరిగితే టౌన్ ప్లానింగ్ విభాగంతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఆటోడ్రైవర్లు

# రేపు ఆటో ఆకలి కేకలు మహాసభ

కమాన్‌పూర్, మే 25: ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆటో ఆకలి కేకలు మహాసభను విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్లు కోరారు. మండల కేంద్రంలో మహాసభ వాల్ పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న మందసభకు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మట్ట నర్సయ్య, మండల జేఏసీ అధ్యక్షులు కందుల నర్సింగం, సదానందం, జంగపెల్లి తిరుపతి, రెడ్డి శేఖర్, కాస రవి, సుంచు శ్రీనివాస్, భూంపెల్లి ఓదెలు, దీకొండ రమేష్, నీర్ల స్వామి, ఆడెపు సారయ్య, ముకీద్, అఫ్జల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వానలు పడుతున్నా.. వడ్లు జోకుతలేరు

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- జిల్లా అదనపు కలెక్టర్ వచ్చినా సెంటర్ల నుంచి కదలని ధాన్యం
- పడిగాపులు గాస్తున్న రైతులు



పెద్దపల్లి టౌన్ : వర్షానికి మొలకెత్తిన వడ్లు



పెద్దపల్లి రూరల్ : రాఘవాపూర్ కేంద్రంలో మొలకెత్తిన వడ్లను ఆరబోస్తున్న రైతు

పెద్దపల్లి రూరల్, మే 25: అకాల వర్షాలు రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. ఇప్పటికే వరి కోసి కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని సెంటర్ల నిర్వాహకులు తూకం వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట, పెద్దపల్లి సింగిల్ విండోలతో పాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ, పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట, ముత్తారం, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో మాత్రం హైదరాబాద్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ అసోసియేషన్(హెచ్ఏసీఏ) ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలోనే కొనుగోలు చేస్తున్నామని, వర్షాలకు తడిసినా రైతులు ఎవరూ భయాందోళనకు గురి కావొద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు హామీ ఇచ్చారు. ఇటీవల కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లను పరిశీలిం చారు. వడ్ల కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు రెండు రోజులుగా కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తున్నారు. హమాలీలు, లారీల కొరత లేకుండా చూసుకుంటూ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అవసరమైతే అదనంగా హమాలీలను తెప్పించి వడ్లు తూకం వేయాలని ఆదేశించారు. అందుకు తగ్గట్లుగా లారీలు సకాలంలో వస్తేనే కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం పూర్తి అవుతుందని, వాతావరణ పరిస్థితులను చూస్తుంటే భంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**కేంద్రాల్లోనే మొలకెత్తుతున్న ధాన్యం**

పెద్దపల్లి టౌన్,మే 25: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు, బంధంపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వడ్లు తడిచిపోయాయి. రైతులకు బాసటగా నిలవాల్సిన ఐకేపీ కేంద్రాల నిర్వాకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కి్రతం కాంట వేసిన వడ్లు ఐకేపీ సెంటర్‌లోనే ఉన్నాయని, లారీలు లేవనే సాకుతో కాలయాపన చేస్తున్నారని రైతులు చెబుతన్నారు. ఇప్పటికైనా బంధంపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన వడ్లను వెంటనే తరలించాలని కోరుతున్నారు.



పెద్దపల్లి టౌన్ : వడ్ల కుప్పపై పరదా కప్పుతున్న రైతు

## ప్రియుడి ఇంటిముందు వివాహిత బైఠాయింపు

జ్యోతినగర్, మే 25: ప్రియుడు మోసం చేశాడని ఓ వివాహిత యువకుడి ఇంటి ఎదుట బైఠాయించిన సంఘటన ఆదివారం రామగుండం నగరపాలక సంస్థ పరిధి ఐదోడివిజన్ నర్రశాలపల్లిలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. నర్రశాలపల్లికి చెందిన చిలుముల రాకేశ్ తన ఇంటి సమీపంలోని ఓ యువతిని ప్రేమించాడు. అయితే అప్పటికే ఆ యువతికి మరో వ్యక్తితో వివాహమైంది. ఆమెకు ఒక పాప కూడా ఉంది. పుట్టింటికి వచ్చిన ఆ యువతితో యువకుడు మళ్లీ ప్రేమాయణం సాగించాడు. ఈ క్రమంలో చోటుచేసుకున్న సంఘటనలతో పెద్దల సమక్షంలో భర్తతో యువతికి విడాకులు జరిగాయి. తాజాగా ఆ యువతి పెళ్లికి ముందు నుంచి ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుంటానని అతని ఇంటి ముందు బైఠాయించింది. పెళ్లికి ప్రియుడు, అతని కుటుంబ సభ్యులు నిరాకరించి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఇంటిముందు బైఠాయించిన యువతిని ఎన్టీపీసీ పోలీసులు ఠాణాకు తీసుకెళ్లి తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

## రేషన్ బియ్యం పట్టివేత

- 29కి ంటాళ్ల బియ్యం పట్టుకున్న సివిల్ సప్లై, టాస్క్‌ఫోర్స్ పోలీసులు..
- ఇద్దరి పై కేసు నమోదు



అధికారులు పట్టుకున్న బియ్యం బస్తాలు

మంథని రూరల్, మే25: ప్రభుత్వం పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ఇస్తున్న సన్న బియ్యాన్ని అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. మంథని మండలం సూరయ్యపల్లి పంచాయతీ పరిధిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన సన్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన 60 బస్తాలు సీజ్ చేశారు. వాటిని మంథని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. ఈ బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేసే బ్యాగులనే అక్రమార్కులు దారి మళ్లించడంతో నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు దాడులు నిర్వహించారు. తరలించడానికి సిద్ధంగా ఉన్న బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారుగా 29.20 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమార్కులు పక్కదారి పట్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా నింధితులు సదానందం, సంజీవ్‌లపై మంథని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు శ్రీనివాస్, బాల్ సింగ్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం అందించే బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పరీక్ష కేంద్రం వద్ద అధికారులు

## ప్రశాంతంగా గ్రామపాలన అధికారి పరీక్షలు

- 82 మంది హాజరు..8 మంది గైర్హాజరు
- పరీక్షల నిర్వహణను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

పెద్దపల్లి రూరల్, మే 25: జిల్లాలో గ్రామపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం గ్రామపాలన అధికారుల ఎంపికకు పరీక్షలు నిర్వహించింది. ఆదివారం జిల్లాకు సంబంధించిన 90 మంది అభ్యర్థులకు పెద్దపల్లి మండలం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలకు కేంద్రంగా కేటాయించారు. ఈ పరీక్షలకు 90 మందికి గాను 82 మంద అభ్యర్థులు హాజరుకాగా 8 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు సందర్శించారు. పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట సీఎస్, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య, అబ్జర్వర్ డాక్టర్ జి పురుషోత్తం ఉన్నారు.

## క్రీడలపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం



క్రీడా దుస్తులు అందజేస్తున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్ కాలనీ, మే 25: విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యమని ఆర్జీ–2 జీఎం బీ.వెంకటయ్య అన్నారు. డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులు, పరిసర ప్రాంతాల పిల్లలకు వాలీబాల్, పుట్‌బాల్, బాస్కెట్ బాల్‌లో 25 రోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగిసింది. ఆదివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పిల్లలకు క్రీడా దుస్తులు అందజేశా రు. కోచ్‌లను సన్మానించి గౌరవ వేతనం అందజేశారు. కార్య క్ర మంలో ఏఐటీయూసీ సెక్రటరీ రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ, అధికారుల సంఘం ప్రతినిధి జనార్దన్, డీవైపీఎం వంశీధర్, ఓసీపీ–3 సంక్షేమాధికారి అజీజ్, సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, కో–ఆర్డినేటర్ పోశం, సంతోష్‌సంతోష్, నాయకులు శ్యాంసన్, సాంబశివరావు, రవీందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రీడా విభాగాల తనిఖీ

యైటింక్లయిన్ కాలనీ, మే 25ః స్థానిక సీఈఆర్ క్లబ్‌లోని క్రీడా విభాగాలను ఆదివారం ఆర్జీ–2 జీఎం బీ.వెంకటయ్య ఆదివారం తనిఖీ చేశారు. సీఈఆర్ క్లబ్‌లోని స్విమ్మింగ్ పూల్, అధునాతన సదుపాయాలతో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ కోర్టులను పరిశీలించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఖర్చుకు వెనుకాడకుండా అత్యుత్తమ క్రీడా సదుపాయాలు అందించేందుకు సంస్థ ఎప్పుడు ముందుంటుందని చెప్పారు. ఉద్యోగులు క్రీడా సౌకర్యాలను వినియోగించుకొని ఆరోగ్య వంతులుగా ఉండాలని కోరారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించారు. పూల్ నిర్వహణ, మరింత మెరుగుపరిచే దిశగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెక్రెటరీ రవీందర్, డీజీఎం ధనుంజయ, అధికారుల సంఘం ప్రతినిధి జనార్దన్, డీవైపీఎం వంశీధర్, సంక్షేమాధికారి అజీజ్, సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, కో–ఆర్డినేటర్ పోశం, సంతోష్, నాయకులు శ్యాంసన్, సాంబశివరావు, రవీందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మంత్రి మెప్పు కోసమే ఐఎన్టీయూసీ ఆరోపణలు

గోదావరిఖని మే 25: మంత్రి శ్రీధర్‌బాబు మెప్పు కోసమే ఐఎన్టీయూసీ నాయకులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని వివేక్ వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పీ మల్లికార్జున్, రాచకొండ కోటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడారు. ఐఎన్టీయూసీ సింగరేణి విభాగం నాయకుడు జనక్‌ప్రసాద్ ప్రోద్భలంతోనే యూనియన్ నాయకులు వివేక్ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వివేక్ ఎప్పుడు మాట్లాడ లేదని, మాలలకు న్యాయం జరుగాలని మాత్రమే కోరారని చెప్పారు. వివేక్ వ్యాఖ్యలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నట్లు వారు ఆరోపించారు. రాష్ట్ర మినిమం వేజ్‌బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన జనక్‌ప్రసాద్ కార్మికులు ఏం చేశారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

గోదావరిఖని, మే 25: అభివృద్ధి పనులపై సింగరేణి అధికారులతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం స్థానిక ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ చౌరస్తాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం , ఇంటర్నల్ రోడ్లు, తాగునీటి కోసం రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ వాటర్ పనులు, జనగామ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, లైటింగ్స్ ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. మురుగు నీటిని శుభ్రం చేసే ఎస్టీపీల నిర్మాణంలో పురోగతి, ముస్లింల ఖబ్రస్థాన్ నిర్మాణ పనుల వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ సింగరేణి ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## ప్రశాంతంగా డీఈఈసెట్ ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష

రామగిరి, మే 25: స్థానిక మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన డీఈఈసెట్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షలో 137 మందికి గానూ 100 మంది హాజరు కాగా, 37 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 144 మందికి గానూ 103 మంది హాజరు కాగా, 41 మంది పరీక్ష రాయలేదని ప్రిన్సిపాల్ బీ.విష్ణువర్ధన్ తెలిపారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## జర్నలిస్టు మునీర్ మృతిపట్ల సంతాపం

గోదావరిఖని, మే 25: సీనియర్ జర్నలిస్టు , తెలంగాణ ఉద్యమకారుడు మునీర్ మృతిపట్ల సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కే స్వామి, ఆరెపల్లి పోశం, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కే కనకరాజ్, రమేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మునీర్ కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలు, కార్మికుల సమస్యలపై దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను నిరంతరం విశ్లేషణతో వ్యాసాలు రాశారని గుర్తు చేసుకున్నారు. సింగరేణి ఉద్యోగుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన మునీర్ అనారోగ్యంతో మృతిచెందడం సింగరేణి ప్రాంత వాసులకు తీరని లోటని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి

పెద్దపల్లి రూరల్, మే 25: గౌరెడ్డిపేట శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో బబ్బూరి శ్యామ్ అనే రైతుకు చెందిన ఆవు మృతి చెందింది. పాలిచ్చే ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ పరంగా పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు

ఫర్టిలైజర్‌సిటీ, మే 25: స్థానిక వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమాన్ని ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజ్‌హంస, మెకానిక్ డీజీఎం రమేశ్ ఠాకూర్, హెచ్ఆర్ డీజీఎం సోమనాథ్ ఆదివారం సందర్శించారు. వృద్ధులతో మాట్లాడిన అధికారులు ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు పీటీ స్వామి, జీ సత్తయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఇప్టా వార్షికోత్సవం

గోదావరిఖని, మే 25: ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా) 83వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక భాస్కర్‌రావు భవనలో ఘనంగా జరిగింది. ఇప్టా జాతీయ నాయకులు కే స్వామి పతాకావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇక్కడ సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజ్, నాయకులు గోసిక మోహన్, ఎజ్జ రాజయ్య, గౌతం గోవర్ధన్, ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి లెనిన్, తాళ్ళపల్లి మల్లయ్య, మడికొండ ఓదెమ్మ, రమేశ్‌కుమార్, సూర్య అబ్దుల్ గని, కళాకారులు ఉన్నారు.

## కృష్ణానగర్‌లో వైద్యశిబిరం

జ్యోతినగర్, మే 25: కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని రాధాకృష్ణ కన్వెన్షన్‌హాల్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. 300మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

## ఈసెట్ లో ఐదో ర్యాంక్



మణిదీప్

ముత్తారం, మే 25: తెలంగాణ ఉస్మాని యా యూనివర్సిటీ నిర్వహించిన ఈసెట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన బండారి మణిదీప్ మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో 5వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. మొత్తం 200 మార్కులకు గాను 109 మార్కులు సాధించాడు. ఈ సెట్ లో మంచి ర్యాంక్ సాధించిన బండారి మణిదీప్ ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## నిత్యావసర సరుకులు వితరణ

రామగిరి, మే 25: కల్వచర్ల గ్రామానికి చెందిన బండి మల్లేశ్ తన భార్య లక్ష్మి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం కల్వచర్ల, లొంకకేశారం గ్రామాల్లోని 16 మంది సపాయి కార్మికులకు దుస్తులు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, వెన్నం శ్రీనివాస్, బండి శ్రీకాంత్, శ్రీనివాస్, బండి సంపత్, కుందారపు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

గోదావరిఖని, మే 25: మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు ఇతర మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌ను హత్యగా పేర్కొంటూ సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. కశ్మీర్ పహెల్గాం ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఆపరేషన్ సింధూర్‌లో దాగి ఉన్న నిజాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ నరేశ్, జిల్లా నాయకులు ఏ వెంకటన్న, చిలుక శంకర్, రామకృష్ణ, రాజేశం, మెరుగు చంద్రయ్య, రైతు సంఘం నాయకులు ముడిమడుగుల మల్లయ్య, మల్లేశం, బుచ్చన్న కొల్లూరి మల్లేశ్, దుర్గయ్య, పుట్ట స్వామి, రవికుమార్, కొమురయ్య ఉన్నారు.

## సందడిగా ఆత్మీయ సమ్మేళనాలు



యైటింక్లయిన్ కాలనీ : ఉపాధ్యాయులతో శాంతినికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు

జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎస్సెస్సీ పూర్తయిన అనంతరం వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాలతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న పాఠశాలల్లో మళ్లీ కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. గోదావరిఖనిలోని గీతాంజలి హైస్కూల్( 2000-2001 బ్యాచ్) ఎస్సెస్సీ విద్యార్థులు, యైటింక్లయిన్ కాలనీ శాంతికేతన్(2005-06), సుల్తానాబాద్ యమండలం నారాయణపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల( 2004-2005) ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు.

- ఫర్టిలైజర్‌సిటీ/యైటింక్లయిన్ కాలనీ/ సుల్తానాబాద్ రూరల్, మే 25



ఫర్టిలైజర్‌సిటీ : ఉపాధ్యాయులతో గీతాంజలి పాఠశాల పూర్వ విద్యార్థులు

# మంథనిలో బీసీల అణచివేతకు మంత్రి కుటుంబమే కారణం

కమాన్‌పూర్/రామగిరి/ముత్తారం, మే 25: మంథనిలో బీసీల అణచివేతకు మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబమే ప్రధాన కారణమని బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ ఆరోపించారు. వాంకిడి నుంచి అలంపూర్ వరకు చేపట్టిన బీసీల మేలుకొలుపు యాత్రలో భాగంగా ఆదివారం కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం మండలాల్లో కొనసాగింది.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని అంబేద్కర్, పూలే విగ్రహాలు, అమరవీరుల స్తూపాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. మంథనిలో బీసీల అణచివేతకు మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబమే ప్రధాన కారణమని ఆరోపించారు. తాను మంథనికి వెళ్తే కచ్చితంగా మంత్రిని కలవాలని నాకు అనేక ఫోన్‌కాల్స్, బెదిరింపు కాల్స్ వచ్చాయని ఆరోపించారు. మేమెంతో మాకంత అనే నినాదంతో తాను వందల కి.మీ రథయాత్ర చేపట్టాననీ, బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన 18 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల మేలుకొలుపు యాత్ర పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నామని, ఎక్కడ బీసీ చట్ట సభలకు పోటీ చేసే అక్కడ బీసీలంతా పార్టీలకతీతంగా బీసీలను గెలిపించుకోవడానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అనంతరం యాత్ర ముత్తారం మీదుగా కొయ్యూరు వరకు సాగింది. కార్యక్రమాల్లో మహనీయుల కమిటీ అధ్యక్షులు తగరం శంకర్‌లాల్, బీసీ నాయకులు నల్లవెల్లి శంకర్, బొమ్మగాని అనిల్ గౌడ్, గుర్రం లక్ష్మీమల్లు, మేకల సంపత్, నీలం శ్రీనివాస్, పోలుదాసరి సాయికుమార్, పొన్నం నవీన్, తోట రాజ్‌కుమార్, సాన సురేశ్, మానుక ఓదెలు, గుంజపడుగు సంతోష్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేసీ రవీందర్, రైతుబంధు అధ్యక్షుడు మేదరవేని కుమార్ యాదవ్, నాయకులు గౌతం శంకరయ్య, చెల్కాల జవహర్, వేగోళపు మల్లయ్య, ధర్మల రాజసంపత్, మేడగోని రాజన్న, గాజుల ప్రసాద్, ఆసం తిరుపతి, సత్యం, దామెర శ్రీనివాస్, గద్దల శంకర్, కొండవేన ప్రభాకర్, నూనె రాజేశం, మల్యాల మోహన్, స్వామి, బొంకూరి రాజేశ్ , మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ , మాజీ సర్పంచ్ గాదం శ్రీనివాస్ , మాజీ ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు అల్లం తిరుపతి, చల్ల సమ్మయ్య, కురాకుల ఓదెలు, అలువోజు రవీందర్ , మాల్యాల శంకర్ , శ్రీశైలం, బీసీ ఆజాది ఫెడరేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం మహేందర్, నాయకులు బండ నిఖిల్ వడ్డేపల్లి మనోహర్, గుమ్మాల శ్రీనివాస్, జక్కని శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి విశిష్ట సత్కారం

ధర్మారం,మే25:బాలసాహిత్య వికాసం కోసం విశిష్ట సేవలు అందిస్తూ విద్యార్థులు పలు రచనలు చేయడానికి ప్రోత్సహిస్తున్న నర్సింహులపల్లి జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ కు అరుదైన గౌరవం దక్కింది. బాల సాహిత్యంలో చేస్తున్న సేవలను తెలంగాణ సారస్వత పరిషత్తు భాస్కర్‌ను గుర్తించి ఆహ్వానం పంపింది. సంస్థ 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్ లో నిర్వహించిన 'బాల సాహిత్య సమ్మేళనం' కార్యక్రమంలో లో భాస్కర్‌కు ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, శాంతా వసంత ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఐ వర ప్రసాదరెడ్డి, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా దక్షిణ ప్రాంతీయ అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్, నిర్వాహకులు గరిపెల్లి అశోక్, కూకట్ల తిరుపతి, యువశ్రీ మురళి, వివిధ ప్రాంతాల బాలసాహితీవేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెళ్లి రోజున ఆర్థిక సాయం

కోల్‌సిటీ, మే 25ః గోదావరిఖని కాకతీయ నగర్‌కు చెందిన పాషా అనే నిరుపేద కుటుంబంకు భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. పాషా భార్య కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. అతని కుటుంబ పరిస్థితి తెలుసుకున్న గోదావరిఖనికి చెందిన లతా రామ్మోహన్ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు నసీమా చేతుల మీదుగా రూ.5వేలు అందజేశారు. పెళ్లి రోజున ఆడంబరాలకు ఖర్చు చేయకుండా కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబంకు సాయం అందించడంపై రామ్మోహన్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా, గట్ల రమేష్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బొల్లం మధుబాబు పాల్గొన్నారు.

## ఓసీపీ-3 లో..

యైటింక్లయిన్ కాలనీ, మే 25: ఆర్జీ–2 ఓసీపీ–3లో సంక్షేమాధికాగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన పీ.రాజు కుటుంబానికి ప్రాజెక్టు అధికారులు ఆర్థిక సాయం అందజేశారు. ప్రాజెక్టు అధికారి ఉదయ్ హరిజన్ మాట్లాడుతూ నిబద్ధత గల సహోద్యోగిని కోల్పోయామని, ఆయన అకాల మృతి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ భరత్ కుమార్, సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.